# ఈ దేశంలో ఇది మామూలే!

కిరణ్మయి నడుస్తోంది.

చీకట్లో...నాంపల్లి ఫుట్‌పాత్ మీంచి—

కిరణ్మయి ఏదో ఆలోచిస్తూంది.

ఏవో గోళాలు (గందరగోళం, భూగోళం, సూర్యగోళం అని అనేక రకాల గోళాలు) ఆమె హృదయంలో పల్టీలు కొడుతున్నాయి.

ఆమె మనసంతా చీలిపోతున్నట్టు మెదడు నిండా బాధలు !!

చీర సరిచేసుకుంటూ వడివడిగా అడుగు లేసుకుంటూ నడుస్తోంది.

చీకటి పూటన్నమాటే గాని—చుట్టూ వెలుగులే !

కిరణ్మయి చూపులు తీక్షణంగా ఉన్నాయి.

'ఆలిండియా రేడియో స్టేషన్' ఎర్రబుగ్గ ఆకాశంలో మెరిసిపోతూ చూడ్డానికి చాలా ఆకర్షణీయంగా వుంది. తెల్ల దుప్పటి కప్పుకుని 'అసెంబ్లీ' హాల్ నిద్దరపోతూ ఉంది. రంగు రంగుల బల్బుల్తో, రకరకాల అలంకరణలతో రవీంద్ర భారతి ధగధగ మెరసిపోతోంది కొందరి 'ప్రత్యేకమైన' జీవితాల్లాగా.

రవీంద్ర భారతి ముందు—

కార్లు...స్కూటర్లు...వాహనాలన్నీ బారులు తీర్చినాయి.

ఆ ఆనందంలో డబ్బులేని (టికెట్టు కొనలేని) వారికి 'నో ఎంట్రెన్స్' కాబోలు ! భారతి లోపలికి వెళ్ళనివ్వకుండా బయటకు తోసేస్తుంది.

నెక్లెస్‌లు...గులాబీలు...కోట్లు... టైలు స్వాగతాల మధ్య మురిసిపోతున్నాయి.

ఇస్త్రీలేని దుస్తులూ - తక్కువ రకం చూపులూ చీకట్లోకి తిరిగొచ్చేస్తున్నాయి.

కిరణ్మయి కళ్ళకి ఎదురుగా ఉన్న దృశ్యాలన్నీ పాముల్లాగా అల్లుకుపోతున్నాయి !

ఆరిపోతూ, వెలుగుతోన్న ఫుట్‌పాత్ వీధిలైటు క్రింద—

ఒక తల్లి ఆక్రోశిస్తోంది. ఆకలితో ఒర్రుతోన్న రోగిష్టి బిడ్డను చూపెడుతూ...

కిరణ్మయి గుండె బద్దలై పోయింది

అణువణువులో సూదులు గుచ్చుతున్నట్లు ఒకటే బాధ -

కార్లు - బస్సులూ, డబుల్ డెక్కర్లూ - రకరకాల వాహనాలన్నీ దూసుకుపోతున్నాయి. కానీ - కిరణ్మయి మాత్రం నడుస్తోనే వుంది.

దూరం నుంచి వస్తున్న లైట్ల కాంతి కిరణ్మయి మీద పడింది.

కిరణ్మయి అచ్చం మెరపులా ఉంది!!

కళ్ళద్దాల లోంచి, కారు అద్దాల లోంచి కిరణ్మయి చాలా అందంగా కనిపించింది. గొప్పింటి గారాల బిడ్డ 'ప్రశాంత్ కుమార్'' కి.

స్ట్రీట్ ట్యూబ్ లైట్ కాంతి పడబట్టో, కారు లైట్ల కాంతి పడబట్టోకాని కిరణ్మయి ''జిగేల్''న మెరసి పోతోంది.

ఎంత సింపుల్‌గా, నీట్‌గా ఉంది?

అబ్బ! గులాబీ పువ్వు!

ఛ ఛ, సినీతార మంజు!!

నో, అప్సర!!!

కాదు - వర్ణించలేనంత పొందిక ఆ రూపం...

ఊహాతీతమైన ఆ అందం...

ప్రశాంత్ మనసులో ప్రశాంతత కరువైంది.

కారాగింది. కిరణ్మయి ప్రక్కనే.

తల తిప్పి చూసింది కిరణ్మయి

"ఎక్కడికి వెళ్ళాలి మేడమ్!" కారు మాట్లాడింది. కిరణ్మయిలో "భయం" మొలచింది. పలకలేదు నిశ్శబ్దంగా ఉంది

"మీరేమీ అనుకోకపోతే..." కిరణ్మయి మూగదానిలా ఉండిపోయింది.

"కారులో సీటు ఖాళీగా వుంది మీరు రావచ్చు" జీవితంలో మొదటిసారిగా కోపం ప్రదర్శించింది కళ్ళతోనే మూతి ముడుచుకుంది

కొంగు భుజాల చుట్టూ బిగ్గరగా కప్పుకుని చకచకా అడుగులేసింది.

"వెరీ బ్యూటిఫుల్!... బట్ సిల్లీ" అనుకుని కారు "బుర్రు" మంది.

కిరణ్మయి ఇంకా నడుస్తోంది.

ఆకాశవాణి పక్కకు తప్పుకుంది అసెంబ్లీ నిశ్చేష్టంగా మిగిలిపోయింది. రవీంద్ర భారతి కోలాహలం క్షణ క్షణానికి



నందిని సిధారెడ్డి

దూరమై పోతోంది.

* * *

కిరణ్మయికి పదహారేళ్ళుంటాయి. ఈ పదహారేళ్ళలోని తన పదేళ్ళ స్పృహలో... కిరణ్మయి ఎప్పుడూ తండ్రిని చూళ్ళేదు. తల్లిని మాత్రం నెల క్రితం వరకూ

చూస్తూ బతికింది.

ఏడాది క్రితం వరకూ కిరణ్మయి పువ్వులా బతికింది.

తన తల్లి తనని ప్రాణంలా చూసుకొనేది. డబ్బు లిచ్చి బడికి పంపించేది. తన తల్లికి డబ్బులెలా వచ్చేవో కిరణ్మయికి తెలీదు. కిరణ్మయి మాత్రం హాయిగా ఉండేది ఉన్నట్టుండి కిరణ్మయి తల్లి రోగిష్టి అయిపోయింది.

మంచం పట్టింది. ఎనిమిది నెలలు హాస్పిటల్ బెడ్ మీద తీసుకుంది. కూడబెట్టిన కొన్ని సొమ్ములూ ఆస్పత్రి పాలైనాయి అద్దె కొంప ఖాళీ అయిపోయింది. కిరణ్మయి సైతం హాస్పిటల్ లోనే ఉండేది. డాక్టర్లు...నర్సులు... మందులు ... కంపౌండర్లు హాస్పిటల్‌నిండా ఉన్నా. తన తల్లి రోగం నయం కాలేదు.

హాస్పిటల్ మురికి గుంటలా కనిపించింది తనకి ఆ వాతావరణం విషపు గాలిలా తోచేది. ఎనిమిది నెలలయినా కిరణ్మయి తల్లి హాస్పిటల్ బెడ్ దిగలేదు. డాక్టర్ల గొప్పతనమే అనుకొంది కిరణ్మయి! అనుకోకుండా ఓరోజు "తన తల్లి బెడ్ మీంచి దించి వేయబడింది"

మంచం మీంచి దించింది మనిషిగా కాదు 'శవంగా' అని తెల్సేక కిరణ్మయి భోరున ఏడ్చింది.

పొంగి వచ్చే దుఃఖాన్ని అంతా కక్కబోయింది హాస్పిటల్ అరుగు మీదే. ఆస్పత్రి ఖరాబవుతుందని అక్కడ ఏడ్వనివ్వ లేదు, శ్మశానంలో కూచుండి రోజుల తరబడి ఏడ్చింది కిరణ్మయి.

* * *

కిరణ్మయి చూపులు 'బస్' వైపు చూస్తున్నాయి.

ప్రశాంత్ చూపులు కిరణ్మయిని చూస్తున్నాయి.

నల్ల కోట్ల చూపులన్నీ బాంకులవైపు చూస్తున్నాయి.

ప్రశాంత్ మనసులో 'కిరణ్మయి'

కారు కదిలింది. కారులోని ప్రశాంత్ హృదయంలో 'కార్లు' పరిగెత్తుతున్నాయి

ఆ అందం... ఆ సౌందర్యం... ఆ రూపం...తన జీవిత భాగమైతే, ఓహో వాటే లక్కీ"!

నాల్రోజులు కష్టపడి ఓసారి కిరణ్మయిని పరిచయం చేసుకున్నాడు ప్రశాంత్. తన ఇరవయ్యేళ్ళ "లోకానుభవం" ప్రయోగించాడు కిరణ్మయిమీద. కిరణ్మయి హృదయం కొంచెం ఎడం అయింది.

ఓ రోజు సాయంత్రంపూట పబ్లిక్ పార్కులో కిరణ్మయి ఒంటరిగా ఉన్నప్పుడు ప్రశాంత్ కలుసుకున్నాడు

కిరణ్మయిలో ఆకలి! ప్రశాంత్‌లోనూ ఆకలే!

ఓపొట్లం పల్లీలు కొనితెచ్చి కిరణ్మయి ముందు పెట్టాడు.

"కిరణ్మయీ, నేనో మాటడగనా..."

కిరణ్మయి బదులు పలకలేదు. తలొంచుకుంది. పల్లీలు ఒక్కొక్కటే ఒలుస్తున్నాడు ప్రశాంత్.

"నేను నిన్ను ప్రేమిస్తున్నాను."

కిరణ్మయి కళ్ళెత్తి ప్రశాంత్ కళ్ళలోకి చూసి దింపేసుకుంది. కొంగును భుజం చుట్టూ బిగుతుగా కప్పుకుంది.

"మా నాన్నని ఎదిరించగల్ను...నేను నిన్ను పెళ్ళి చేసుకుంటాను" చేతిలో పొట్టు విసిరేసి పల్లీపలుకులు కిరణ్మయి చేయి తెరిపించి అందించాడు అయినా కిరణ్మయి

పెదవులు కదపలేదు ఆ పలుకులు తినలేదు.

"కిరణ్మయీ, నీకేం? నువ్వొప్పుకుంటే రెండ్రోజుల్లో పెళ్ళి చేసుకుంటాను.అవితిను"

ఆకలి కిరణ్మయిని చంపేసింది. ప్రశాంత్ ఫోర్స్‌మీద పల్లీలు నోట్లో వేసుకుంది.

ప్రశాంత్ ఏదేదో చెబుతున్నాడు చీకటి పడింది ట్యూబ్ లైట్లు వెలిగాయి పల్లీలు ఒడిసి పోయినయ్ గాలికి కాగితం రివ్వున ఎగిరి పోయింది.

పద వెళ్దాం!"

ప్రశాంత్ కుమార్ కారులో కిరణ్మయి కాలు పెట్టింది.

* * *

కిరణ్మయి రెండ్రోజుల్నుంచి ఆకలిని పూర్తిగా మరచిపోయింది. ప్రశాంత్ కట్టించిన బంగళాలో ప్రస్తుతం కిరణ్మయి నివసిస్తోంది.

సాయంత్రం పెళ్ళి! ప్రశాంత్‌కి తనకి.

ఫ్రెండ్సందర్నీ తీసుకొస్తానని వెళ్ళాడు ప్రశాంత్

ప్రశాంత్ నిజంగా సహృదయుడు. మనుషుల్ని ఇట్టే చదవగల్డు. పరిస్థితుల్ని అర్థం చేసుకోగల్డు. అంత వున్నతమైన వ్యక్తితో! పెళ్ళి !!

డబ్బున్న వాడై వుండి, డబ్బులేని నిరుపేదని, తనని పెళ్ళి చేసుకోవడమంటే నిజానికి ప్రశాంత్ మనసు ఎంత గొప్పదై ఉండాలి!"

కారు చప్పుడయింది. కిరణ్మయి ఉలిక్కిపడి చూచింది. ఫ్రెండ్సెవరూ రాలేదు. ప్రశాంత్ ఒక్కడే హడావుడిగా వున్నాడు. సిగరెట్ పొగ రింగులు రింగులుగా వదులుతున్నాడు. "కిరణ్మయీ" నిశబ్దం పెళ్ళున విరిగి పోయింది. కిరణ్మయి పెదవులు కదిపే లోపల ప్రశాంత్ గొంతు మళ్ళా...

"కిరణ్మయీ, నువ్వు... వేశ్యవి."

కిరణ్మయి గుండె ఆగిపోలేదు. డబుల్‌కి డబుల్‌గా కొట్టుకుంటుంది. కొంచెం దమించి తోసినా అంత బాధ వుండేది కాదు అతి కష్టంగా పెదవులు విప్పింది.

"కాదు".

నోట్లోంచి సిగిరెట్ తీసి, కింద పడేసి బూటు కాలితో నలిపేస్తూ అన్నాడు ప్రశాంత్

"ఇదివరకు కాదు, కావచ్చు, ఇప్పుడు ఇప్పుడు 'కా'!"

"ఎందుకొక్కావాలి? అంత కంటె చస్తాను అసలేమైంది? ఎందుకిలా...ఎవరుచెప్పారు?"

కిరణ్మయి ఏ ప్రశ్న అడగాలో తోచక తోచిన వన్నీ ఏకరువు పెట్టింది భోరుమంది

"మీ తల్లి వేశ్య. అంటే నువ్వూ అంతే కదా!"

"మా తల్లి...నా తల్లిని...ఎవరన్నారు? అంతా...అంతా... అబద్ధం! మోసం!"

కిరణ్మయి ముఖంమ్మీద నెత్తుటి చుక్కలు ఇంకిపోయాయేమో? నల్లబడి కమిలిపోయింది మొఖం.

"నువ్వేమన్నా చెప్పు, నీతల్లి వేశ్య".

"మానాన్న నాకు వేరే సంబంధం చూశాడు. ఆస్తి అంతస్తు అన్నీ వున్నాయి వాళ్ళకి."

కిరణ్మయిలో కోపం బుసలు తొక్కుతుంది. అయినా బూతులు తిట్టలేకపోయింది.

"మరి... మొన్న ... అట్లెందుకు...? అంత ఇదిగా..."

"చెబుతా, జవాబా?"

జేబులోంచి రెండు పచ్చనోట్లు తీశాడు. కిరణ్మయి మనసులా రెపరెపలాడి పోతున్నాయవి.

"రెండ్రోజులకి"

కిరణ్మయి (లో) బంగళా కూలిపోయి నట్లయింది. గుండెల్లో బర్మా పెట్టి పగల గొడుతున్నట్లుంది కిరణ్మయికి.

మాట్లాడ బోయింది. తిట్ట బోయింది. కోపం పొంగి పొరలింది. పెదవులు కదిలాయి. శబ్దం రాలేదు.

కళ్ళు రక్తపు గుంటల్లా ఉన్నాయి. చుర చురా చూసింది. నోట్లనూ ... ప్రశాంత్‌నీ. కళ్ళు చూసి చూసి మూసుకు పోయాయి. తెరుచుకోలేదు. నేలకేసింది తల.

క్షణాల మీంచి కాలం పరిగెత్తుతూనే ఉంది.

కిరణ్మయి కళ్ళు తెరిచే సరికి—

కారు వెళ్ళి పోయింది. కాలం చెయిజారి పోయింది. చుట్టూ చూసింది. అంతా శూన్యంగా ఉంది, రెండు నోట్లు తప్ప—

కిరణ్మయి మళ్ళీ ఫుట్‌పాత్ మీది కొచ్చేసింది.

పగలు మధ్యాహ్నం పూట!

ఎండకి నగరం తళ తళ మెరసి పోతుంది.

కిరణ్మయికి అది పగలైనా చీకటిగానే ఉంది.

ఆమె కళ్ళ నిండా ఒకటే చీకటి.

అయినా- కార్లు మెరపుల్లా దూసుకెళ్ళటం చూస్తోనే ఉంది. పొంగివచ్చే కసిని దిగమింగు కుంటోంది. రవీంద్ర భారతి ముందు రాళ్ళలా పడి వున్న కార్ల వంక చూస్తూ గట్టిగా ఉమ్మేసింది.

ఆకాశవాణి ఏదో గొణుగుతూనే ఉంది. అసెంబ్లీ హాల్ నిద్రలో జోగుతూనే వుంది. కిరణ్మయి మళ్ళా నడుస్తోనే ఉందిప్పుడు *

## వచ్చే వారం:

- ఆత్మహత్యలూ, ఆగిపోండి! (విశేష రచన) — శ్రీకాంత్ రెడ్డి
- ఎన్నికలు? (కథ) — సిహెచ్. మధు
- ఫ్యాక్టరీ - ఓ సంఘం (కథ) — దేవరాజు మహారాజు
- ది గైడ్ (కథ) — పమ్మి వీరభద్రరావు
- కుంభమేళా సంరంభం — కె. కె.
- శ్రీశ్రీ చైనా పర్యటన విశేషాలు, 'అనంతం'లో.
- వాసిరెడ్డి సీతాదేవి సీరియల్ 'సావేరి'
- సినీతంత్ర • బాలతంత్ర • రాజు - పేద

— ఇంకా ఇతర ఆకర్షణలు.